క్లుప్తంగా

అకాల వర్షం ధాటికి రూ.3 లక్షల నష్టం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ శివారు గ్రామము వెలమ వారిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున అకాల వర్షం ఈదురు గాలులు ధాటికి రూ.3 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు మేరకు గ్రామానికి చెందిన రైతు కాగితపు వెంకటేశ్వర్లు ఆరు గాలం కష్టంచి పండించిన మొక్కజొన్న–75 క్వింటాలు, మినుము–15 క్వింటాల మార్కెటు ధర లేనందున తనకున్న రేకుల షెడ్డులో నిల్వ ఉంచాడు. ఆ సమయంలో పెనుగాలులు బలంగా వీచడంతో ఇంటిపైకప్పు ఏర్పాటు చేసిన రేకులన్నీ చెల్లాచెదురైనాయని ఆవేదన చెందాడు. పాలకులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి



నాదెండ్ల: గుండెపోటుకు గురై నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సరగాల జయరావు (44) గుండె పోటుతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సరగాల జయరావు 2009లో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం పొందారు. 2023లో సివిల్ విభాగంలో చేరారు. ఏడాది నుంచి నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. ఆయన స్వగ్రామం ఈపూరు మండలం ఉప్పరపాలెం గ్రామం. హైదరాబాద్‌లో ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు గత నెల 30న బస్సులో బయలుదేరారు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో గుండెపోటుకు గురికావటంతో ఎల్‌బీ నగర్‌లోని కామినేని హాస్పటల్‌లో చేర్చారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి చిలకలూరిపేట మీదుగా స్వగ్రామానికి తీసుకెళ్తుండగా రూరల్ సీఐ సుబ్బానాయుడు, నాదెండ్ల ఎస్సై జి పుల్లారావు, సిబ్బంది నివాళులు అర్పించారు.

బెదిరించినా లెక్కచేయని మహిళలు

నాదెండ్ల: అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు స్థానిక ప్రజల నుంచి స్పందన కరువైంది. మండల పరిధిలో 20 బస్సుల్లో వెయ్యి మందిని తరలించాలని కూటమి నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు రోజులుగా ప్రజలను సభకు తరలి రావాలంటూ వారి ఇళ్ల చుట్టూ తిరిగి ప్రచారం చేశారు. ముఖ్యంగా డ్వాక్రా, అంగన్‌వాడీ గ్రూపుల సభ్యులను సభకు రావాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయా గ్రామాలకు బస్సులు చేరుకోగా, సీటుకొకరు చొప్పున కూడా సభకు వెళ్ళలేదు. కొన్ని గ్రామాల్లో మహిళలు రాకపోవటంతో విద్యార్థులను సైతం బస్సులెక్కించారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో మహిళలు బస్సులెక్కేందుకు ఆసక్తి చూపకపోవటంతో బస్సు ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు మహిళల ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరించారు. మిమ్మల్ని డ్వాక్రా గ్రూపుల నుంచి తొలగిస్తాం, లోన్లు రద్దు చేస్తామని బెదిరించినా.. మీ ఇష్టం వచ్చింది చేసుకో పొమ్మంటూ మహిళలు ముఖంపైనే చెప్పటంతో అధికారులు తెల్లబోయారు.

సామూహిక ఉపనయనాలు



చిలకలూరిపేట: ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఓగేరువాగు అయ్యప్ప స్వామి ఆలయం ఎదురు సమితి కార్యాలయంలో సామూహిక ఉచిత ఉపనయనాలు నిర్వహించారు. వేదపండితులు గబ్బిటి వెంకటేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఏకా మారుతీశర్మ, పోలూరి చంద్రమౌళి, పావులూరి శేషగిరి, ధూళిపాళ శ్రీకాంత్, పవన్‌కుమార్, శ్రావణ్‌కుమార్, హనుమాచార్యులు పాల్గొన్నారు.

వేద పాఠశాల ప్రారంభం



సత్తెనపల్లి: మండలంలోని కంటేపూడి గ్రామంలో గతంలోనే ఆరంభించిన శ్రీ కంచి కామకోటి పీఠంలో శ్రీ జయేంద్ర సరస్వతి స్మార్త వేద పాఠశాల శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకుడు కాపుగంటి శ్రీ వెంకటరత్నం మాట్లాడుతూ తన బాల్య మిత్రుడు పైడా జనార్దన్ ఆధ్యాత్మిక జీవితాన్ని కొనసాగిస్తూ వేద పాఠశాలను ప్రారంభించటం జరిగిందన్నారు. ఆది శంకరార్యులు జయంతి సందర్భంగా ప్రారంభించినట్లు తెలిపారు. దీని నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న భరత్‌కుమార్ రెడ్డిని కూడా అభినందించారు. కార్యక్రమంలో చల్లా రత్తయ్య, పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, దివ్వెల శ్రీనివాసరావు, యెల్లినేడి రామారావు, జేఎల్ఎన్ రెడ్డి, కోనంకి మారుతి, అబ్బూరి సత్యనారాయణ, విశ్వనాథం తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన 'కిశోరి వికాసం'

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ కార్యక్రమాలు
- కిశోరి బాలి కలకు పలు అంశాలపై అవగాహన
- విద్యార్థుల సామర్థ్యం పెంపునకు దోహదం
- 61,830 మంది కిశోరి బాలికలు శిక్షణకు అర్హులు



కొండవీడులో వేర్వేరుచోట్ల కిశోరి వికాసంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

యడ్లపాడు: మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో 'కిశోరి వికాసం' కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఈనెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరి బాలికలకు ప్రత్యేకంగా వేసవి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 నుంచి 18 సంవత్సరాల బాలికల సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా వివిధ అంశాలపై అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి అధికారులు రూపొందించిన రోజువారి ప్రణాళిక క్షేత్రస్థాయిలో అమలు చేయనున్నారు.

జిల్లాలో...

పల్నాడు జిల్లాలో 2010 అంగన్‌వాడీ కేంద్రాలు, 21 మిని అంగన్‌వాడీలు ఉన్నాయి. వాటి పరిధిలో ఉన్న 61,830 మంది కిశోరి బాలికలు వికాసం శిక్షణకు అర్హులు. వీరిలో 11 నుంచి 14 సంవత్సరాలు వయస్సు కలవారు –35435 మంది, 15 నుంచి 18 మధ్యవారు –26395 మంది ఉన్నారు.

ఇదీ శిక్షణ లక్ష్యం!

విద్య మనిషికి ఆశాకిరణం. ఈ శిక్షణ శిబిరాల ప్రధాన ఉద్దేశం బాలికలలో సామాజిక అవగాహన పెంచి, విద్యాపట్ల ఆకర్షణ పెంచేలా చేయడం. ''విద్యా వెలుగు'' ద్వారా జీవిత మార్గాన్ని వెలిగించాలన్నదే ఇందులో అంతర్లీనంగా దాగిన సందేశం. భవిష్యత్తులో చురుకైన పౌరులుగా ఎదగేందుకు కావలసిన మార్గదర్శకతను ఇవి అందించనున్నాయి.

అవగాహన కల్పించే అంశాలు

నెలరోజులకు పైగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాల వివరాలు.. 2వ తేదీన బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవటం, 6న రుతుక్రమ పరిశుభ్రత, 9న లైంగిక విద్య, 13న బాలల హక్కుల రక్షణ, చట్టం గురించి అవగాహన, 16న కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, 20న ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు, 23న ఉన్నత విద్య నైపుణ్యాలు, కెరీర్ మార్గదర్శకత్వం, 27న సైబర్ నేరాలు ఆన్‌లైన్ భద్రత, 30న ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, జూన్‌నెల 3వ తేదీన కౌమార బాలిక నాయకత్వం, సాధికారత, 6న యోగ, ధ్యానం,శారీరక వ్యాయామం ఆటల ప్రాముఖ్యత, 10న బాల్యవివాహాలు– దుష్ప్రభావాలు, తదితర అంశాలను వివరిస్తారు. ఈ శిక్షణ శిబిరంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. జూన్ 4న అన్నీ గ్రామాల్లో బాలికల తల్లిదండ్రులతో సమావేశం జరగనుంది. ఇందులో వారు తమ పిల్లల అభివృద్ధిపై, శిక్షణలో భాగస్వామ్యం గురించి చర్చించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఈ వేసవి శిక్షణ కార్యక్రమాల్ని కిశోర బాలికలు తప్పక సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు పాల్గొనేందుకు సహకారం అందివ్వాలి. విద్య పట్ల శ్రద్ధ, సమాజం పట్ల ఒక అవగాహన కలిగించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ ఉద్దేశం.

–ఎం ఉమాదేవి, పీడీ ఐసీడీఎస్ పల్నాడు

ఉజ్వల భవితకు తొలి అడుగు



ఈ శిక్షణలు కేవలం ఒక వేసవి కార్యక్రమంగా కాకుండా, జీవితాన్ని మార్చే పాఠ్యాంశాలుగా మారనున్నాయి. బాలికల్లో దాగున్న సృజనాత్మక సామర్థ్యాలు ఈ శిక్షణతో మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుంది. దీంతో వారి భవితవ్యం ఉజ్వలంగా మారుతుంది.

–ఎం జోజమ్మ, సూపర్‌వైజర్ యడ్లపాడు

బాల్య వివాహాలను అరికట్టాలి

సీడీపీవో అనురాధ



కిషోరీ వికాసం కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో అనురాధ

శావల్యాపురం: బాల్య వివాహాలు అరికట్టాలని, ఆడ పిల్లలు కూడా అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కిశోరి వికాసం కార్యక్రమాన్ని తొలి రోజు దీప ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈసందర్భంగా సీడీపీవో అనురాధ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలోని అంగన్‌వాడీ సెంటర్లలో కిశోరీ వికాసం కార్యక్రమంపై అవగాహన సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. 11 నుంచి 18 సంవత్సరాల వయసు కల్గిన బాలికలు సమూహాలుగా ఏర్పాటు చేసి కిశోరి వికాసంపై అవగాహన కల్పించామన్నారు. వారంలో మంగళవారం, శుక్రవారం రెండు రోజులు పాటు నిర్వహిస్తామన్నా రు. రక్తహీనత, రుతుక్రమంలో తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహారం తదితరవాటి గురించి వివరించారు. సాధికార మహిళలు కావాలంటే కిషోరి బాలికలు అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కిషోరు బాలికలు పోషకాలు కల్గిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవటం ద్వారా ఆరోగ్యవంతంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. బాల్య వివాహాలు చేయటం ద్వారా జరిగే అనర్థాలు వివరించారు. ఆడ పిల్లలకు ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు టోల్ ఫ్రీ నంబరు 1098కు చేయాలన్నారు. అనంతరం కిషోరీ వికాసం గురించి వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, మహిళా పోలీసు గౌసియాబేగం, అంగన్వాడీ టీచర్ల గోవిందమ్మ, జస్సీకరాణి, గోపమ్మ, ఎస్తేరిరాణి పాల్గొన్నారు.

మే 25 నుంచి కిశోరి వికాసం

వినుకొండ: ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మే 25 నుండి జూన్ 10వ తేదీ వరకు సమ్మర్ స్పెషల్ ఎవెర్నస్ క్యాంప్స్ కిశోరి వికాసం జరుగుతుందని సీడీపీవో ఎం. అనురాధ తెలిపారు. మండలంలోని విఠంరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 11 నుండి 18 సంవత్సరాల బాలికలకు ఆరోగ్యం, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ వేసవి సెలవుల్లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోరి వికాసం పేరిట అవగాహన శిబిరాలను ప్రారంభించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ శిబిరాల్లో బాలికలను చైతన్యవంతులను చేయడం ద్వారా వారు జీవితంలో ఆత్మధైర్యంతో ముందుకు సాగడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగరాజుకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కిశోర బాలికల హక్కుల రక్షణకై పనిచేయాలి

నాదెండ్ల: కిశోర బాలికల హక్కులు, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కిశోరబాలికల వికాస కమిటీ పని చేయాలని కన్వీనర్, మహిళా పోలీస్ సుభాషిణి చెప్పారు. నాదెండ్ల సచివాలయంలో శుక్రవారం కిశోర బాలికల వికాస కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో అంగన్‌వాడీలు, ఆయాలకు సెలవులు ఉన్నందున, కమిటీ నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా వేసవి తరగతులు నిర్వహించాలన్నారు. ఈ కమిటీలో కన్వీనర్‌తో పాటూ సభ్యులుగా వీవోఏ, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్, ఏఎన్ఎం ఉంటారన్నారు.

కిశోర బాలికల కోసం వేసవిలో ప్రత్యేక శిబిరాలు



రేమిడిచర్లలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో

బొల్లాపల్లి : మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వేసవి ప్రత్యేక శిబిరాల్లో భాగంగా శుక్రవారం కిశోరి వికాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ హాజరై మాట్లాడుతూ 15 నుంచి 18 సంవత్సరాల వయసు కలిగిన కిషోర బాలికలకు గ్రామస్థాయిలో వేసవిలో ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. తొలి రోజు సమావేశాల్లో ఆయా గ్రామాల్లో కిషోర బాలికల పరిచయ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ రోజు నుంచి జూన్ 12 వరకు కిషోర బాలికలను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయా కమిటీలు కిషోరి వికాసం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచనలు చేశారు. ప్రతి గ్రూపునకు 20 మంది కిషోర బాలికలు ఉంటారని, ఆయా గ్రూపులకు ఆరోగ్యం, బాల్య వివాహాలు అరికట్టడం, ఆర్థిక స్వావలంబన, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత వంటి పలు అంశాలపై వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీయూ కృష్ణారెడ్డి, వైద్యులు వై.సాయివినూత్న, సూపర్‌వైజర్లు వి.శ్రీదేవి, షేక్ మస్తాన్‌బి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామకమిటీలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

బస్సులు లేక... ఎదురు చూడలేక!!

- అప్పుడొకటి చొప్పున వచ్చిన బస్సులతో ప్రయాణికుల అసహనం
- ఉన్న బస్సుల్లో ఎక్కువగా అమరావతి సభకు కేటాయింపు



బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం పల్నాడువైపుకు వెళ్లే బస్సులులేక నిరీక్షిస్తున్న ప్రయాణీకులు

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమరావతి పున నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం బస్సు ప్రయాణీకుల సహనానికి పరీక్ష పెట్టింది. స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న బస్సుల్లో మూడోవంతు బస్సులు ప్రధానమంత్రి పాల్గొనే పున నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభకు జనాలను తరలించేందుకు కేటాయించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి వివిధప్రాంతాలకు బయలుదేరిన ప్రయాణికులకు వారికి కావాల్సిన బస్సులు సకాలంలో రాక అవస్థలు పడ్డారు. గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. డిపోలో సంస్థకు చెందినవి, అద్దెకు తీసుకున్నవి కలిపి సుమారుగా 89 బస్సులు ఉండగా అందులో 35 బస్సులను సభకు జనాలను తీసుకెళ్లేందుకు కేటాయించారు. కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించటంతో బస్సుల కేటాయింపు అలవోకగా జరిగిపోయింది. దీంతో రోజు వారీ నరసరావుపేట నుంచి గుంటూరు మధ్య తరిగే నాన్‌స్టాప్ బస్సుల్లో సగానికిపైగా కొరత ఏర్పడింది. అలాగే వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, రొంపిచర్ల, సత్తెనపల్లివైపునకు తిరిగే బస్సులు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. అప్పుడొక బస్సు చొప్పున వచ్చినా అవి ఎక్కేందుకు నానా తంటాలు పడాల్సివచ్చింది. అలాగే పై ప్రాంతాల నుంచి వయా నరసరావుపేట మీదుగా వెళ్లే బస్సులు అప్పుడొకటి చొప్పున వచ్చే బస్సులే కొంత ఆధారమయ్యాయి. కొంతమంది వేచిచూసి బస్సులు సకాలంలో వచ్చే అవకాశం లేదని గ్రహించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ గమ్యస్థానాలకు తరలి వెళ్లారు. కాగా, సభకు వెళ్లే బస్సులను మూడో వార్డులో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఉదయాన్ని ప్రారంభించారు. తాను తన సొంత కారులో సభకు తరలి వెళ్లారు.



మూడో వార్డు నుంచి సభకు వెళుతున్న బస్సు వద్ద నాయకులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

చివరి భూములకు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న ఉలవలపూడి రాము

నరసరావుపేట ఈస్ట్: నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలని పల్నాడు జిల్లా ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో సాగునీటి కాలువలకు పూడికలు తీయించకపోవటం, చెట్లు పెరగటం, షెట్టర్లు పగిలిపోవటం వంటి కారణాలతో చివరి భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఎన్నో ఆశలతో పెట్టుబడులు పెట్టి సాగు చేపట్టిన రైతులకు కన్నీళ్లు మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాలువలకు మరమ్మత్తులు చేయించి ఈఏడాదైనా సక్రమంగా చివరి భూములకు సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య పాల్గొన్నారు.

ప్రజాసంఘాల నాయకుల ఇంటి అరెస్ట్



నల్లపాటి రామారావు హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

నర సరావుపేట రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమరావతి పర్యటన సందర్భంగా పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావును పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. జొన్నలగడ్డలోని తన నివాసం నుంచి బయటకు వెళ్లకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆసుపత్రికి వెళ్లాలనుకున్నా పోలీసులు అడ్డుకొని నిర్బంధించడాన్ని పీడీఎం జిల్లా నాయకుడు రామకృష్ణ ఖండించారు. ఈ విధంగా పలువురు ప్రజాసంఘాల నాయకులను హౌస్ అరెస్ట్‌లు చేయడం, కొందరికి నోటీసులు ఇచ్చారని సంఘాల నాయకులు తెలిపారు. పౌరుల స్వేచ్ఛను హరించేలా కూటమి ప్రభుత్వం విధానాలు ఉండటం సరైనది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ విధనాలను మార్చుకోవాలని సూచించారు. ప్రజాస్వామిక వాదలు ఇలాంటి ఘటనలను ఖండించాలని కోరారు.

కార్మిక చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి కె. మధుస్వామి

నరసరావుపేటటౌన్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ పథకాలపై వ్యవసాయ మార్కెట్ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాన సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె. మధస్వామి పాల్గొని మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు చట్ట ప్రకారం ఉన్న సౌలభ్యాలు, హక్కులు, ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలు, ఎంప్లాయిస్ ఎంప్లాయర్ వివాద పరిష్కారాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొని పౌరసరఫరాల శాఖ సిబ్బంది, రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో ఈదురు గాలులు.. వర్షం

- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- పడిపోయిన చెట్లు



ఆటోపై విరిగిపడిన చెట్టు

రొంపిచర్ల : మండలంలో శుక్రవారం ఉదయం ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బలంగా ఈదురుగాలుల వీయటం వలన మండలంలో పలు గ్రామాలలో చెట్లు పడిపోయాయి. స్థానిక బీసీ కాలనీలో గల ఒక ఇంటి ముందు గల చెట్టు కొమ్ములు విరిగి అక్కడ ఉన్న ఆటోపై పడటం వలన ఆటో పూర్తిగా దెబ్బతిన్నది. ఈ వర్షాలకు తోడు ఈదురు గాలుల వలన విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాలకు కళ్ళాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న విత్తనాలు తడువకుండ రైతులు వాటిపై టార్పాలిన్ పరదాలు కప్పారు. విపరీతంగా కాస్తున్న ఎండలకు ఈ వర్షాల వలన ఉపశమనం కలిగించిందని కొందరు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సాయంత్రం కూడా కొన్ని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. ఈ వర్షాల వలన కోతకు వచ్చిన దాళ్వా వరి దెబ్బ తింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదో రోజుకు చేరిన వైద్య సిబ్బంది సమ్మె



స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురుగా ఎండవేడికి రోడ్డుపై కూర్చుని నినాదాలు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

మండుటెండలో సమ్మె చేస్తున్న సీహెచ్‌వోలు

నరసరావుపేట: తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురుగా గత సోమవారం నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) చేస్తున్న సమ్మె శుక్రవారంతో ఐదోరోజుకు చేరింది. అత్యధిక ఉష్ణోగ్రతలు మధ్య టెంట్‌లో కూర్చున్న. పలువురు సీహెచ్‌వోలు టెంట్‌ల కింద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సమ్మెలో పాల్గొంటున్నారు. వీరిలో అత్యధికంగా మహిళలే ఉండటం గమనార్హం. జిల్లాలో ఆయుష్మాన్‌భవన్, రాష్ట్ర వైద్యఆరోగ కుటుంబ సంక్షేమశాఖల కింద విలేజ్ క్లినిక్స్‌లో సీహెచ్‌వోగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తాము పనిచేస్తున్న హెల్త్ సెంటర్లను మూసేసి ఏపీ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీఏ) ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. జిల్లా అధ్యక్షురాలు ఎం.అనుపమ మాట్లాడుతూ తాము ఐదురోజులుగా పనిచేస్తున్నా ఎవరూ స్పందించకపోవటం దారుణమన్నారు. గురువారం డీఎంహెచ్‌వో తమ శిబిరం వద్దకు వచ్చి తమ డిమాండ్లు విని వెళ్లిపోయారన్నారు. ఉపాధ్యక్షులు కె.వినోధ్, జిల్లా కో ఆర్డినేటర్ బి.సాగర్, ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ జిల్లా తాము 361మంది పనిచేస్తున్నామన్నారు. తామందరమూ ఆరేళ్ల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా చేస్తున్నామని, నిబంధనల ప్రకారం తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తమకు 23 శాతం వేతన సవరణ చేయాలని కోరారు. క్లినిక్స్ అద్దెబకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్టు అందజేయాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌వోలకు మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, ట్రాన్స్‌ఫర్స్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. పలువురు సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా ఆది శంకరాచార్య జయంతి



సత్తెనపల్లి: ఆది శంకర జయంతి వేడుకలు ప్రతి గ్రామంలో నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని సత్య ధ్యానమందిర కమిటీ అధ్యక్షుడు సూరవఝుల రాజ్య మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని నాగార్జుననగర్ కాలనీలో గల సత్య ధ్యాన మందిర ఆవరణలో శుక్రవారం ఆదిశంకర జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్య మోహనరావు మాట్లాడుతూ శంకరుని జయంతి సందర్భంగా ఉచిత సామూహిక ఉపనయనాలు, వ్యాసరచన పోటీలు, పేదవారికి వస్త్రాలు దానం ఇవ్వటం శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో ధ్యాన మందిరం కోశాధికారి కొమార నాగరాజు, యోగా అభ్యాసకులు తదితరులు పాల్గొన్నారు.

రెండో అదనపు సివిల్ జడ్జిగా సుజన్‌కుమార్



సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి సుజన్‌కుమార్‌ను సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, ఏపీపీ బగ్గి నరసింహారావు, న్యాయవాదులు గుజ్జర్లపూడి మార్కురావు, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉన్న రెండో అదనపు సివిల్ జడ్జి న్యాయస్థానం రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా సుజన్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ న్యాయమూర్తిగా విధులు నిర్వహించిన షేక్ మహమ్మద్ గౌస్ సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు 6వ ఏఎంఎం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా బదిలీ అయ్యారు. అనంతపురంలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా విధులు నిర్వహిస్తున్న సుజన్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని